క్లుప్తంగా

సివిల్ రైట్స్ డే



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీవాణి

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెంలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ శ్రీవాణి మాట్లాడుతూ...షెడ్యూల్డ్ కులాల సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందకుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మారెడ్డి, ఏఎస్సై మల్లారెడ్డి, ఏపీఎం సుధాకర్, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: సీతంపేట గ్రామంలో గురువారం మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా.. అధికారులు పౌరహక్కులపై వారికి వివరించారు. రెవెన్యూ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పౌరహక్కుల గూర్చి వివరిస్తున్న అధికారులు

కొమ్మలు కమ్మేస్తున్నాయి..

- రాజీవ్ రహదారిపైకి వ్యాపిస్తున్న చెట్ల కొమ్మలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

తిమ్మాపూర్: మండలంలోని అలుగునూర్ నుంచి రేణిగుంట టోల్‌ప్లాజా వరకు ఉన్న రాజీవ్ రహదారిని చెట్ల కొమ్మలు కమ్మేస్తున్నాయి. ఏపుగా పెరిగిన చెట్లు.. గతంలో కురిసిన వడగండ్ల వర్షానికి ఏపుగా పెరిగి రోడ్డుపైకి ఒరిగాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఓ వాహనదారుడు ఇందిరానగర్– రామకృష్ణ కాలనీ మధ్యలో చెట్టు కొమ్మను ఢీకొని కింద పడ్డాడు. ఈప్రాంతంలోనే పాఠశాలలు, కళాశాలల ఉండడంతో విద్యార్థులకు సైతం ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రాజీవ్ రహదారి నిర్వహణను చూసుకునే హెచ్‌కేఆర్ సంస్థ, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షిస్తున్న పంచాయతీరాజ్‌శాఖ వీటిని పట్టించుకోవడం లేదు. రోడ్డ మధ్యలో ఉన్న మొక్కల రక్షణకు, గడ్డి తొలగింపునకు చర్యలు తీసుకుంటున్న హెచ్‌కేఆర్ సంస్థ రోడ్లపైకి వచ్చిన చెట్ల కొమ్మల తొలగింపు తమ పనికాదని చెబుతోంది. మొక్కలు నాటిన పంచాయతీరాజ్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్లు వాటి నిర్వహణను చూసుకోవాలని పేర్కొన్నారు. అయితే వాహనదారులు మాత్రం టోల్ వసూలు చేస్తున్న రోడ్డు నిర్మాణ సంస్థ నిర్వహణను గాలికొదిలేసిందని ఆరోపిస్తున్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే రాజీవ్ రహదారి మీదికి వ్యాపించిన చెట్లను కొమ్మలను తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.





రామకృష్ణకాలనీ శివారులో రాజీవ్ రహదారిపై చెట్ల కొమ్మలు

కొమ్మలను తొలగించాలి



రెండు రోజుల క్రితం ఇందిరానగర్ నుంచి కరీంనగర్ వైపు కారులో వెళ్తుండగా ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ చెట్ల కొమ్మలు తలుగుతాయని ఒక్కసారిగా కుడివైపు వచ్చాడు. ఏం జరిగిందో తెలియక సడన్ బ్రేక్ వేశాను. ఆగి చూస్తే ముందున్న చెట్ల కొమ్మలు తలుగుతాయని వెనకాల చూసుకోకుండా పక్కకు వచ్చానన్నాడు. నేను ఏమరపాటుగా లేకుంటే ప్రమాదం జరిగేది. అధికారులు, టోల్ నిర్వాహకులు వాహనదారులకు ఎలాంటి ప్రమాదం జరగకముందే రాజీవ్ రహదారిపైకి వ్యాపించిన చెట్ల కొమ్మలను తొలగించాలి.

– పొన్నం అనిల్ గౌడ్, మన్నెంపల్లి, వాహనదారుడు

నీళ్లివ్వకుండా రైతులను బలిచేయొద్దు

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- చీమలకుంటపల్లెలో పంటల పరిశీలన

గన్నేరువరం: యాసంగి పంటలు ఎండకముందే సాగునీరు ఇవ్వాలని, నీళ్లివ్వకుండా రైతులను బలిచేయొద్దని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సాగునీరు లేక చీమలకుంటపల్లెలో ఎండిపోతున్న మొక్కజొన్న పంటను గురువారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి పరిశీలించారు. మేడిగడ్డ దగ్గర గోదావరిలోకి 5 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మేడిగడ్డ దగ్గర గోదావరి నదిపై కాఫర్ డ్యాం నిర్మాణం చేసి వెంటనే నీటిని అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోసి అక్కడి నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి ఎత్తిపోయడంతో పాటు కాల్వల ద్వారా పంటలకు సాగునీరు అందించాలని కోరారు. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోయాయనే సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను ఎండబెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. యాసంగి పంటలకు సాగునీరు అందకపోవడంతో కళ్లముందే పంటలు ఎండిపోతుంటే రైతులు గుండెలవిసేలా కన్నీరు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేరసమయి బాలకిషన్

పెడుతున్నారని తెలిపారు. గత బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు సాగు నీరు ఎప్పుడు అవసరం పడితే అప్పుడే సాగు నీళ్లు అందించిందన్నారు. అసమర్థ ప్రభుత్వ కారణంగా చెరువులు, పంటలు ఎండిపోయే దుస్థితి వచ్చిందని విమర్శించారు. రాబోయే 15 రోజుల్లో ఎండలు ముదిరితే తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడి అందని ప్రమాదం ఉందని, నిర్లక్ష్యం చేస్తే మూగజీవాలకు తాగునీరు లభించని పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాజన్నసిరిసిల్లా జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎలుక దేవయ్య, దీటి రాజు, జక్కుల నాగరాజుయాదవ్, దూలం సంపత్‌గౌడ్, సాయి పాల్గొన్నారు.

సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



సైన్స్ డేలో ఫారెస్టు రేంజ్ అధికారి బుర్ర లత, తదితరులు

రామడుగు: ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని ఫారెస్టు రేంజ్ అధికారి బుర్ర లత తెలిపారు. మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి పాఠశాలలో గురువారం నిర్వహించిన సైన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో రాణించాలంటే సూచించిన మార్గంలో ప్రయాణం చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థుల సైన్స్ పరికరాలను పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నేషనల్ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్ పులి ఆంజనేయులుగౌడ్, పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ ఆలే వెంకటనారాయణ, డైరెక్టర్లు మునీందర్‌రెడ్డి, భూమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



శివ కల్యాణంలో రమణాచార్యులు

గన్నేరువరం: జంగపల్లి గ్రామంలోని శ్రీభక్త మార్కండేయ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు, శివ కల్యాణంతో గురువారం ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా ముగిశాయి. చివరి రోజు మయూరగిరి పీఠాధిపతులు శ్రీమాన్, శ్రీనమిలికొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, జలాధివాసం, ధాన్య ఫల పుష్పా శయ్యాధివాసం, మంగళవాయిద్య వేద మంత్రోచ్చారణల మధ్య శివ కల్యాణం జరిపించారు. మాజీ బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దర్శించుకున్నారు. వారిని నమిలికొండ రమణాచార్యులు శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మహిళా అధ్యక్షురాలు కుసుంభ నవీన, ఎంపీటీసీ గూడెల్లి ఆంజనేయులు, డైరెక్టర్లు రవిగౌడ్, గొల్లపల్లి రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రభాకర్, నూకల తిరుపతి, వెంకటరమణరెడ్డి, మల్లేశం, ఆంజనేయులు, వెంకటమల్లు, వేద పండితులు రామకృష్ణమాచార్యులు, భరత్‌కుమారాచార్యులు, శ్రీకాంతాచార్యులు, శ్రీనాథాచార్యులు, కౌశికాచార్యులు, గీతాచార్యులు, రమేశ్‌స్వామి, వివేక్‌స్వామి, పద్మశాలీలు పాల్గొన్నారు.

అక్రమంగా ధాన్యం తరలింపు

శంకరపట్నం: మండలంలోని గద్దపాకలో సహకార సంఘం గోదాంలో నిల్వచేసిన ధాన్యం బస్తాలను అక్రమంగా తరలిస్తుండటం చర్చనీయాంశమైంది. గత సీజన్‌లో సహకార సంఘంద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మండలంలోని తాడికల్ శివారులోని రాజరాజేశ్వర మిల్లుకు కస్టం మిల్లు ధాన్యాన్ని మరపట్టి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి తరలించాల్సి ఉంది. కానీ గద్దపాక సహకార సంఘం పరిధిలోని కొనుగోలు చేసిన మిల్లు ధాన్యాన్ని సదరు వ్యాపారి గద్దపాక గోదాం అద్దెకి తీసుకొని నిల్వచేశారు. ధాన్యాన్ని తాడికల్ మిల్లుకు సరఫరా చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు లారీల్లో లోడు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. మిల్లు ధాన్యాన్ని రెండు లారీలు లోడింగ్ చేయడం ధాన్యాన్ని మరపెట్టేందుకా, విక్రయించేందుకా అనే విషయం పౌరసరఫరా అధికారులు తనిఖీలు చేస్తేనే అసలు విషయం వెలుగులోకి వస్తుందని మండల ప్రజలు



లారీలో నింపిన ధాన్యం బస్తాలు

చర్చించుకుంటున్నారు. ఈ విషయమై చైర్మన్ తిరుపతిని వివరణ కోరగా ఆరునెలల క్రితం గోదాంను అద్దెకు తీసుకొని ధాన్యం నిల్వ చేశామని, రూ.లక్ష అద్దె చెల్లించేందుకు అగ్రిమెంట్ కుదిరిందన్నారు. మరోనెల గడువు ఉన్నా రైస్‌మిల్ వ్యాపారికి హుజూరాబాద్‌లో మరో మూడు రైస్‌మిల్లులు ఉన్నట్లు తెలిపారు. అందుకే లారీల్లో ధాన్యం తరలిస్తున్నట్లు యజమాని చెప్పినట్లు చైర్మన్ పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం



సభ్యులను అభినందిస్తున్న సంఘం నాయకులు

హుజూరాబాద్: ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ, యువజన నూతన కమిటీలను బుధవారం పట్టణంలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెలగందుల విరూపాక్ష లింగం(విక్కీ), పట్టణ అధ్యక్షుడిగా సుద్దాల హరిశంకర్, యువజన సంఘం అధ్యక్షుడిగా నాగరాజు ఎన్నికయ్యారు. సీనియర్ నాయకుడు గందె శ్రీనివాస్ సభ్యులతో చర్చించి నూతన కమిటీల ఎన్నిక ఏకగ్రీవమయ్యేందుకు కృషి చేశారు. సభ్యులను అభినందించారు. ఎన్నికల అధికారులుగా భూపతి కుమారస్వామి, అకినపల్లి అనిల్‌కుమార్ వ్యవహరించారు.

స్వాగత తోరణం ప్రారంభం

చొప్పదండి: మండలంలోని కొలిమికుంటలో మాచర్ల మహిపాల్ ఏర్పాటు చేసిన బృందావన్‌కాలనీ కమాన్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం ప్రారంభించారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం తగ్గించాలనే సంకల్పంతో మహిపాల్ గ్రామస్తులకు లోహపు సీసాలు విరాళంగా అందించగా ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పురం రాజేశం, ముద్దం తిరుపతిగౌడ్, మునిగాల సుధాకర్‌గౌడ్, ముద్దసాని రంగన్న, పెరుమాండ్ల గంగయ్యగౌడ్ పాల్గొన్నారు.



తోరణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రెండో విడత దళితబంధు ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



మాట్లాడుతున్న అనిల్

జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు రెండో విడత నిధులిచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నాయకుడు పాతకాల అనిల్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దళితబంధును అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే నిలిపేసిందని ఆరోపించారు. దొడ్డె నవీన్, శ్రీకాంత్, అశోక్, అనిల్, సురేష్, రమేశ్, దిలీప్, సాగర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్ష

హుజూరాబాద్: ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం హుజూరాబాద్‌లోని మూడు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. హుజూరాబాద్ పట్టణంలోని మూడు కేంద్రాల్లో 805 మంది విద్యార్థులకు గాను 777 మంది పరీక్ష రాశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 297 మందికి 290 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. మైనార్టీ గురుకుల కళాశాలలో 249 మందికి అందరూ హాజరైనట్లు ప్రిన్సిపాల్ కమారస్వామి పేర్కొన్నారు. కాకతీయ జూనియర్ కాలేజీలో 259 మందికి 244 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ వేణుమాధవ్ తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యంగా వస్తే పరీక్షకు నిరాకరించే విధానం



ఓ పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

పెట్టడంతో చివరి 5 నిమిషాల ముందే పలువురు విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. కరీంనగర్ నుంచి వచ్చిన స్క్వాడ్ అధికారులు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

చొప్పదండి: రానున్న వేసవిలో పట్టణంలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. పురపాలక సంఘంలో గురువారం ఆమె అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సాధారణ సమావేశం జరిగింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలుపరచడానికి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మేనేజర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో చొప్పదండిలో గురువారం ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నల్లల అఖిల్, ముద్దం తిరుపతిగౌడ్, కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు సన్మానం

తిమ్మాపూర్: ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులకు పదవీవిరమణ ఉండదని చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గురువారం చిగురుమామిడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మాజీ సర్పంచ్‌లకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి సన్మానించారు. అనంతరం జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచులు మాట్లాడుతూ.. ఐదేళ్లు తమకు సహకరించిన ప్రజలు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. తమకు వీలైనంత అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్ జెడ్పీటీసీ గీకురు రవీందర్, ఎమ్మార్వో నరేందర్ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, ఎంపీఓ శ్రావణ్, సూపరింటెండెంట్ ఖాజా మొయినుద్దీన్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములుకావాలని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ వినీత



సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ వినీత

తెలిపారు. చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామం 12వ వార్డు ఎస్సీ కాలనీలో ఈజీఎస్ ద్వారా మంజూరైనా నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను అధికారులతో కలిసి గురువారం ప్రారంభించారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ మధుసూదన్,గ్రామ ప్రత్యేక అధికారి రంజిత్ రెడ్డి, ఎంపీటీసీ మంకు సప్న , పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ అధికారి(ఏవో) గోవర్ధన్‌రెడ్డి తప్పుడు బిల్లులతో డబ్బులు తీసుకొని అవినీతికి పాల్పడ్డాడని అంకుషాపూర్ గ్రామానికి చెందిన చెల్పూరి రాములు జిల్లా కలెక్టర్‌కు కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు.

షబ్బీర్ అలీని కలిసిన తుమ్మేటి సమ్మిరెడ్డి



జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సలహాదారుడిగా మహమ్మద్ షబ్బీర్ అలీ పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మనోజ్‌కుమార్‌కు బంగారు పతకం



పతకం అందిస్తున్న గవర్నర్ తమిళిసై

వీణవంక: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఎంఏ లింగ్విస్టిక్స్ (భాషాశాస్త్రం)విభాగంలో ప్రథమస్థానం పొందిన మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సజ్జనపు మనోజ్‌కుమార్ గవర్నర్ తమిళిసైసౌందరరాజన్, విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కిషన్‌రావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం, బంగారు పతకం అందుకున్నారు.

హుజూరాబాద్ సమ్మక్క జాతర ఆదాయం రూ.15లక్షలు

హుజూరాబాద్: పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద జరిగిన సమ్మక్క– సారలమ్మ జాతర హుండీల లెక్కింపు కార్యక్రమం గురువారం హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించినట్లు జాతర కమిటీ చైర్మన్ మూగల రాజిరెడ్డి, వైస్ చైర్మన్ గాలీబు కిరణ్, ఈవో సుధాకర్ తెలిపారు. మొత్తం పది హుండీలను ఏర్పాటు చేసి హుండీల లెక్కింపు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జాతర కమిటీ చైర్మన్ మూగల రాజిరెడ్డి, వైస్ చైర్మన్ గాలీబు కిరణ్ తదితరులు పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం రూ.15,53,516 రాగా బ్యాంకులో జమ చేశామన్నారు. రెండేళ్ల క్రితం జాతర ద్వారా రూ.15.21 లక్షలు రాగా ఈ సారి రూ.32వేలు ఆదాయం పెరిగింది. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, డైరెక్టర్లు , తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో నిర్వహించిన సమ్మక్క, సారలమ్మ జాతర హుండీ లెక్కింపును గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసుల పర్యవేక్షణలో హుండీ లెక్కించగా రూ.7.46 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ రామక్రిష్టారెడ్డి, మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, సమ్మిరెడ్డి, రాజయ్య, సంపత్, సునీల్, కొంరయ్య తదితరులు ఉన్నారు.

జమ్మికుంట వాసికి డాక్టరేట్..

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ఐదోవార్డుకు చెందిన యాట్ల స్రవంతికి కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి నర్సింహాచారి గురువారం డాక్టరేట్ ప్రకటించారు. డాక్టర్ యాట్ల స్రవంతి ఇన్‌విట్రో క్లోనల్ ప్రొవగేషన్ అండ్ జెనిటిక్ ఫెడిలిటీ ఇన్ సెమికార్పస్ అనకార్డీయమ్ ఎల్‌ఎఫ్ అనే అంశంపై విభాగ ఆచార్యులు ఎండీ ముస్తాఫా పర్యవేక్షణలో పూర్తి చేశారు. డాక్టర్ స్రవంతి విద్యాభ్యాసం పట్టణంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్, కాకతీయ జూనియర్ కళాశాల, సాయిరాం డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజెడ్‌సీ, కరీంనగర్ ఎస్ ఆర్ ఎం కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వార్డు కౌన్సిలర్ పిట్టల శ్వేతరమేష్‌లు, కుటుంబ సభ్యులు ,బోధన, బోధనేతర ఉపాధ్యాయులు ,పరిశోధకులు, విద్యార్థులు ,శ్రేయోభిలాషులు అభినందించారు.

సంఘం అభివృద్ధికి సహకరించాలి

మానకొండూర్: సహకార సంఘం అభివృద్ధికి సభ్యులు సహకరించాలని గట్టుదుద్దెనపల్లి విశాల సహకార పరపతి సంఘ అధ్యక్షుడు అనబేరి రాధాకిషన్ అన్నారు. సంఘం అర్ధ సంవత్సర సాధారణ మహాసభ గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం ప్రగతి నివేదిక కార్యదర్శి జి. రామయ్య చదివి వినిపించారు. సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. 51 ఎంక్వైయిలో ఏం తేలిందని, సభ్యుల నుంచి రికవరీ జరిగిందా అంటూ సభ్యులు ప్రశ్నించారు. వినియోగదారులు పెట్రోలు, డీజిల్ పోసుకునేలా పెట్రోలు బంకు సమీపంలో నేషనల్ హైవే నుంచి ర్యాంపు నిర్మించేలా నేషనల్ హైవే అధికారులతో మాట్లాడాలని సంఘం పాలకవర్గానికి సూచించారు. ఎంక్వయిరీ సందర్భంగా గత పాలకవర్గ సభ్యులకు ఈపీ ఫైల్ చేసి జప్తు నోటీసులు ఇచ్చామని అధ్యక్షుడు తెలిపారు.



మాట్లాడుతున్న అనబేరి రాధాకిషన్

అలాగే నేషనల్ హైవే కింద సంఘం పలు ఆస్తులు కోల్పోతుందని, నష్ట పరిహారం గూర్చి వివరించారు. నూతన కార్యాలయ భవన నిర్మాణానికి తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. సభ్యులు సహకరించినప్పుడే సంఘం లాభాల బాటలో పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు కర్క అనంతరెడ్డి, డైరెక్టర్లు సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

రామడుగు: మండలంలోని 23 గ్రామాలలో శుక్రవారం నుంచి మార్చి 31వ తేదీ వరకు నాల్గో విడుత గాలికుంటు వ్యాధి నివారణకు పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నామని మండల పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 1,2,3న షానగర్, కొక్కెరకుంట, 4,5న పందికుంటపల్లి, 6,7న రామడుగు, కిష్టాపూర్, 9న కోరటపల్లి, 10న, గోలిరామయ్యపల్లి, వన్నారం , 11న శ్రీరాములపల్లి, 12న మోతె, 13న చిప్పకుర్తి, 14,15న రాంచంద్రాపూర్, 16,17న గుండి, వెలిచాల, 18,19న లక్ష్మీపూర్, 20న వెంకట్రావుపల్లి, 21,22న రుద్రారం, దేశరాజ్‌పల్లి, 23న రంగసాయిపల్లి, 25,26న దత్తోజీపల్లి, 27,28న గోపాల్‌రావుపేట, వెదిర, 29,30న తిర్మలాపూర్ గ్రామాలలో శిబిరాలు నిర్వహిస్తామని అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.